సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు



గురువారం । 2 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

విజయదశమిని సంతోషంగా జరుపుకోవాలి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): విజయదశమిని జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కాంక్షించారు. ఈ సందర్భంగా పండగ శుభాకాంక్షలను తెలియజేశారు.

శుభాకాంక్షలు

నెల్లూరు రూరల్: జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలను కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు వేర్వేరు ప్రకటనలను విడుదల చేశారు.

పింఛన్ల పంపిణీ



శ్రీనివాస్ మెడికల్ రిపోర్టులను పరిశీలిస్తున్న కలెక్టర్

నెల్లూరు(పొగతోట) / నెల్లూరు (బారకాసు): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం పంపిణీ చేశారు. నగరంలోని మూలాపేటలో గల ఈఎస్సార్ఎం స్కూల్ సమీపంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గతంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసి మూడేళ్లుగా మంచానికే పరిమితమైన పక్షవాత రోగి సిరివెళ్ల శ్రీనివాస్‌కు రూ.15 వేలు, ఒంటరి మహిళ శారదకు రూ.నాలుగు వేలను అందజేశారు. వారి ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలను ఆరాతీశారు. శ్రీనివాస్‌కు సంబంధించిన మెడికల్ రిపోర్టులను పరిశీలించి.. అవసరమైతే ఎమ్మారై స్కాన్‌ను తీయించాలని సూచించారు. కాగా జిల్లా వ్యాప్తంగా 3,07,543 మందికి గానూ 2,88,308 మందికి తొలి రోజు పంపిణీ చేశారు. కమిషనర్ నందన్,, ఎడ్యుకేషన్ సెక్రటరీ రజని తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో 798 పొగాకు బేళ్ల విక్రయం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 798 బేళ్లను బుధవారం విక్రయించామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. వేలానికి 1063 బేళ్లు రాగా, వీటిలో 798ను విక్రయించగా, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని చెప్పారు. 1,00,613 కిలోల పొగాకును విక్రయించగా, రూ.2,16,28,247.70 వ్యాపారం జరిగిందని పేర్కొన్నారు. గరిష్ఠ ధర రూ.330.. కనిష్ఠ ధర రూ.80.. సగటు ధర రూ.214.96గా నమోదైందని తెలిపారు. పది కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

జయ జయహే..
మహిషాసురమర్దిని

విజయదశమి నేడు

శక్తిరూపిణి, జగన్మాత కొలువైన ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మహర్నవమి సందర్భంగా అమ్మవారు చందన, సుగంధభరిత ద్రవ్యాలతో, సౌందర్యమూర్తిగా రత్న భూషణాలు, కిరీటం, పట్టు వస్త్రాల తేజస్సుతో మహిషాసురుడ్ని సంహరించిన శౌర్య రూపంలో సింహవాహనంపై మహిషాసురమర్దినిగా బుధవారం దర్శనమిచ్చారు. శక్తిస్వరూపిణికి సహస్రనామ, దేవీ ఖడ్గమాల, అష్టోత్తర, నిత్య, సామూహిక నవావరణ పూజలు, పూలంగి సేవలు, సంపుటీకరణ, చండీహోమం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సువాసిని, కన్య పూజలు, కలశోద్వాసనలను సంప్రదాయంగా నిర్వహించారు. అశేష భక్తజనంతో అమ్మణ్ణి సన్నిధులు కిక్కిరిసిపోయాయి. అమ్మా.. అమృత రూపిణీ.. జయ జయదేవి అనే జపధ్వనులతో మార్మోగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



నెల్లూరు: మహిషాసురమర్దినిగా రాజరాజేశ్వరి అమ్మవారు

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ బుధవారం సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లోని 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. స్వామివారిని 73,275 మంది మంగళవారం అర్ధరాత్రి వరకు దర్శించుకున్నారు. తలనీలాలను 21,973 మంది అర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.77 కోట్లను సమర్పించారు. టైమ్ స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 15 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లోనే దర్శనం లభిస్తోంది.

కేంద్రీయ విద్యాలయలో 4న ఇంటర్వ్యూలు

నెల్లూరు సిటీ: కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన టీజీటీ (సంస్కృతం), అటల్ లాబ్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలకు సంబంధించిన ఇంటర్వ్యూలను శనివారం నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ కట్టా శంకరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు kothuru.kvs.ac.inను సంప్రదించాలని సూచించారు.

నూతన ఉపాధ్యాయులకు రేపట్నుంచి శిక్షణ

నెల్లూరు (టౌన్): డీఎస్సీ – 2025 ద్వారా నియమితులైన నూతన ఉపాధ్యాయులకు ఇండక్షన్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ఈ నెల పది వరకు నిర్వహించనున్నామని డీఈఓ బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు ఉదయం ఏడింటికి హాజరుకావాలని, శిక్షణ కాలానికి అవసరమైన దుస్తులు, షూస్, దుప్పట్లు, లేటెస్ట్ ఆండ్రాయిడ్ ఫోన్, మందులు తదితరాలను తెచ్చుకోవాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ, తెలుగు, ఫిజికల్ ఎడ్యుకేషన్, సోషల్ స్టడీస్, ఎస్జీటీ, ఎస్జీటీ ఉర్దూకు సంబంధించిన ఉపాధ్యాయులకు కాకుటూరు సమీపంలోని వీఎస్‌యూలో.. ఎస్‌ఏ బయలాజికల్ సైన్స్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్ టీచర్లకు గొలగమూడిలోని ఐఐటీటీఎంలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

గృహ నిర్మాణ శాఖ ఏఈ సస్పెన్షన్

నెల్లూరు(అర్బన్): జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో రాపూరు మండల ఏఈగా పనిచేస్తున్న రామకృష్ణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను ఆ శాఖ ఎండీ శివప్రసాద్ బుధవారం జారీ చేశారు. గతంలో ఈయన నెల్లూరు రూరల్ ఏఈగా పనిచేశారు. కొండ్లపూడి హౌసింగ్ నిర్మాణాల్లో జరిగిన అక్రమాలకు బాధ్యుడిగా చేస్తూ సస్పెన్షన్ వేటేశారు.

సోమశిలలో 72.86 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 72.862 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 23,500 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.

అన్నదాతపై మొసలి కన్నీరు



నేదురుమల్లిలో పర్యటిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- నిర్దయగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం
- ధాన్యాన్ని విక్రయించాక కొనుగోలు కేంద్రాలా..?
- అసెంబ్లీలో సోమిరెడ్డి మొక్కుబడి ప్రస్తావన
- ధ్వజమెత్తిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తూ.. ధాన్యాన్ని విక్రయించాక కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని ప్రకటించడం దారుణమని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నేదురుమల్లిలో బుధవారం పర్యటించిన ఆయన రైతులతో ముచ్చటించి వారి సమస్యలను ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ధాన్యం దిగుబడయ్యాక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అయితే ధాన్యానికి గిట్టుబాటు ధర లభించక మిల్లర్లకు నష్టాలకు విక్రయించాక తాపీగా వీటిని ఏర్పాటు చేస్తామనడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పుట్టి ధాన్యాన్ని రూ.12 వేలకు అన్నదాతలు తెగనమ్ముకుంటే.. సోమిరెడ్డి మాత్రం అసెంబ్లీలో మొక్కుబడిగా ప్రస్తావించి చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. ప్రజల నుంచి అధిక విద్యుత్ చార్జీలను వసూలు చేసిన చంద్రబాబు నేరం చేశారని ఆరోపించారు. వీటిని 12 వాయిదాల్లో చెల్లిస్తాననడం దారుణమని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను తగ్గిస్తానని హామీ ఇచ్చిన ఆయన.. వీటిని పెంచి ప్రజల నడ్డి విరిచారని మండిపడ్డారు.

అవినీతిలో కూరుకుపోయిన సోమిరెడ్డి

రైతులను ఆదుకోవడాన్ని అటుంచి కుమారుడితో కలిసి గ్రావెల్, మట్టి, ఇసుక, బూడిదను అక్రమంగా తరలించడంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బిజీగా ఉన్నారని కాకాణి ఆరోపించారు. ఉద్యోగాలు అమ్ముకోవడం, బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేయడం వంటి కార్యక్రమాలతో పాటు అసాంఘిక శక్తులను పెంచి పోషిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయనకు ఓటెందుకు వేశామని రైతులతో పాటు ప్రజలు తమను తాము ప్రశ్నించుకుంటున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రశ్నించడమే కాకుండా సోమిరెడ్డి అవినీతి కార్యకలాపాలను అడ్డుకున్నందుకే తనపై అక్రమ కేసులు బనాయించారని పేర్కొన్నారు. ఆయన అక్రమాలకు సహకరిస్తున్న అధికారులెవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని.. ప్రజాకోర్టులో వారిని ఎండగట్టడం ఖాయమని స్పష్టం చేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పతకమూరి నాగయ్యను పరామర్శించారు. ఆపై చీర్ల వెంకటేశ్వర్లు కుమార్తె వివాహ వేడుకలకు హాజరయ్యారు. బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ పెంచలనాయుడు, సర్పంచ్ ఉడతా రమేష్, వెంకటశేషయ్య, రవి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డాక్టర్ల సమ్మె



జిల్లా వైద్యశాఖ కార్యాలయం వద్ద వైద్యుల ధర్నా

నెల్లూరు(అర్బన్): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ డాక్టర్ల సంఘ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె బుధవారంతో మూడో రోజుకు చేరుకుంది. సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద అన్ని పీహెచ్‌సీల డాక్టర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యుల సంఘ అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. న్యాయమైన కోర్కెల కోసం ఆందోళనకు ఏడాది క్రితం శ్రీకారం చుట్టామని, వీటిని నెరవేరుస్తామని.. కొంత సమయం కావాలని అప్పట్లో ప్రభుత్వం కోరిందన్నారు. అయితే నేటికీ పరిష్కరించకపోవడంతో విధిలేక సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని వివరించారు. పీహెచ్‌సీల్లో చేరిన డాక్టర్లు 25 ఏళ్లుగా ఎలాంటి ఉద్యోగోన్నతులకు నోచుకోకుండా ఒకే కేడర్‌లో పనిచేస్తున్నారని, వీరికి టైమ్ బౌండ్ ప్రమోషన్లను కల్పించాలని కోరారు. డిమాండ్లను పరిష్కరించేంత వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. తొలుత వైద్యులు సమావేశమై, ప్రభుత్వం దిగొచ్చేంత వరకు సమ్మె చేయాలని తీర్మానించారు. సంఘ కార్యదర్శి శ్రీనివాసులు, నిర్వహణ కార్యదర్శి బాలచంద్రబాబు, కోశాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రావణి, డాక్టర్లు సునీల్‌కుమార్, వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శులు అహ్మద్‌బాబు, నవీన్, శివకల్పన తదితరులు పాల్గొన్నారు.

రోగుల ఇబ్బందులు

ప్రభుత్వ డాక్టర్లు ఆస్పత్రికెళ్లి థంబ్ వేసి ఓపీ చూడకుండా సమ్మెలో పాల్గొంటున్నారు. దీంతో వైద్యం అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. డాక్టర్లు రావడం లేదని తెలిసిన నిరుపేదలు ప్రైవేట్ ఆస్పత్రులకెళ్లి భారీగా వెచ్చిస్తూ అప్పులపాలవుతున్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



అనుమసముద్రంపేట: సచివాలయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సచివాలయ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఎస్‌పేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనను బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నేత ఖాదర్‌వలీ మాట్లాడారు. వలంటీర్ విధులైన ఇంటింటి సర్వే నుంచి విముక్తి కల్పించాలని.. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని.. ఉద్యోగులను వారి మాతృశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. నేతలు రఘు, శేఖర్, షరీఫ్, దేవా, శివ, అస్గర్, ఏడుకొండలు, మస్తాన్, యస్దానీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములను పరిరక్షిస్తాం



సాక్షి ఎఫెక్ట్..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయానికి సంబంధించిన భూములను పరిరక్షిస్తామని ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. కామాక్షితాయి ఆలయానికి చెందిన భూమి ఆక్రమణపై 'టీడీపీ నేత బరితెగింపు' అనే శీర్షికన సాక్షిలో గత నెల 27న కథనం ప్రచురితమైన నేపథ్యంలో కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న 40 సెంట్ల ఆలయ భూమి ఆక్రమణకు గురైన విషయం తన దృష్టికి వచ్చిందని, తహసీల్దార్ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు చేపడతామని వివరించారు. రికార్డుల్లో సదరు భూమి ఆలయానికి చెందినట్లు ఉందని, సంబంధిత ఆధారాలను ఆర్డీఓ, తహసీల్దార్, పోలీస్ అధికారులకు ఇచ్చామని పేర్కొన్నారు. కాగా నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారాన్ని ఈ నెల ఎనిమిదిన నిర్వహించనున్నామని చైర్మన్‌గా నియమితులైన తిరుమూరు అశోక్‌రెడ్డి తెలిపారు.

ఆదిపరాశక్తికి జేజేలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చారు. విశేష పుష్పాలంకరణలో ఉన్న ఆదిపరాశక్తికి భక్తులు ప్రణమిల్లారు.

- సాక్షి నెట్‌వర్క్


నెల్లూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్దినిగా..


జొన్నవాడలో మహిషాసురమర్దినిగా కామాక్షితాయి


రాజరాజేశ్వరి ఆలయంలో భక్తులు


మూలాపేటలో మహిషాసురమర్దిని అలంకరణ


పెంచలకోనలో ధనలక్ష్మీదేవిగా ఆదిలక్ష్మీదేవి

బాల్య వివాహాలను అడ్డుకున్న అధికారులు

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో బాల్య వివాహాలను బుధవారం రాత్రి ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. వారి కథనం మేరకు.. క్రైడ్ సేవా సంస్థ అందించిన సమాచారంతో అధికారులు అప్రమత్తమై రెండు బాల్య వివాహాలను ఆపారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత, ఆత్మకూరు ఎస్సై జిలానీబాషా, ఆ సంస్థ ప్రతినిధి వాగాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.





కండలేరులో 57.550 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 57.550 టీఎంసీలున్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల నుంచి కండలేరుకు 3,600 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590, పిన్నేరు కాలువకు 90, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.



రేపట్నుంచి 34 గ్రామాల్లో రీసర్వే

• రైతులు సహకరించాలి : జేసీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని 34 గ్రామాల్లో ఈనెల 3వ తేదీ నుంచి రీసర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జేసీ మొగిలి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులందరూ పాల్గొని తమ భూముల హద్దులను సర్వే బృందానికి చూపించి రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అనంతసాగరం మండలంలో వరికుంటపాడు, ఏఎస్‌పేటలో కొండమీద కొండూరు, ఆత్మకూరులో బొటికర్లపాడు, జంగాలపల్లి, చేజర్లలో చిత్తలూరు, కలువాయిలో నూకనపల్లి, మర్రిపాడులో బ్రాహ్మణపల్లి, నాగరాజుపాడు, సంగంలో నీలాయపాళెం, సీతారామపురంలో దేవమ్మచెరువు, ఉదయగిరిలో గండిపాళెం, బోగోలులో బిట్రగుంట, అల్లూరులో సింగపేట, దగదర్తిలో చౌటపుత్తేడు, వెలుపోడు, దుత్తలూరులో తెడ్డుపాడు, తిమ్మాపురం, జలదంకిలో చౌడవరం, కలిగిరిలో వీర్నకొల్లు, కావలిలో రాజావారి చింతలపాళెం, విడవలూరులో కాటేపల్లి, కందుకూరులో జిల్లెలమూడి, పాలూరు, కొండాపురంలో కస్తూరి నాయుడుపల్లె, లింగసముద్రంలో నరసింహాపురం, వలేటివారిపాళెంలో శాఖవరం, వీరన్నపాళెం, మనుబోలులో మడమనూరు, ముత్తుకూరులో, పొదలకూరులో భోగసముద్రం, రాపూరులో గరిమెనపెంట, సైదాపురంలో మలిచేడు, టీపీ గూడూరులో ఈదూరు బిట్ - 1, వెంకటాచలం మండలంలో పూడిపర్తిలో సర్వే జరుగుతుందని, రైతులు సహకరించాలని కోరారు.

మహాసమాధి మహోత్సవాలు ఆరంభం


పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నెల్లూరు(బృందావనం): పద్మావతి నగర్‌లోని శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరంలో 107వ మహాసమాధి (ఆరాధన) మహోత్సవాలను బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. భిక్షాటన కార్యక్రమాన్ని ఆ మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. షిర్డీ సంప్రదాయం ప్రకారం సాయినాథుడి స్వరూపులుగా భక్తులు పద్మావతి నగర్, బాలాజీ నగర్, ఏసీ నగర్, సరస్వతీ నగర్ తదితర పురవీధుల్లో భిక్షాటన చేశారు. తొలుత మందిరంలో షిర్డీవాసుడికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయిభక్తులకు పాదపూజ నిర్వహించారు. ఉభయకర్తలుగా గునుపూడి వేణుగోపాల్, రాజ్యలక్ష్మి, కోటంరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీలత వ్యవహరించారు. కార్యక్రమాలను మధుసాయి, గౌరవ సలహాదారులు పాబోలు రామసుబ్బయ్య తదితరులు పర్యవేక్షించారు. విజయదశమి సందర్భంగా గురువారం వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు


రైతులకు అవగాహన కల్పిస్తున్న షరీనా

రాపూరు: వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించడంతో రైతులకు మేలు చేకూరిందని నెల్లూరు డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ అధికారి షరీనా తెలిపారు. మండలంలోని ఆదురుపల్లిలో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం యంత్రాలపై 12 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించిందన్నారు. ట్రాక్టర్ స్పేర్ పార్టులపై 18 నుంచి 5 శాతానికి తగ్గించిందని తెలిపారు. రైతులు తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసి వ్యవసాయం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఏఓ సోమసుందర్, ఈఓపీఆర్‌డీ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో విచ్చలవిడిగా జూదం

• అనికేపల్లిలో డైమండ్ డబ్బా నిర్వహణ
• నిర్వాహకులకు టీడీపీ నాయకుల అండ
• పట్టించుకోని అధికారులు

వెంకటాచలం: దసరా పండగ సందర్భంగా మండలంలోని అనికేపల్లి గ్రామదేవత ఆలయంలో మూడు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయి. తొలిరోజైన మంగళవారం గ్రూపు డ్యాన్స్‌లు వేయించారు. అలాగే విచ్చలవిడిగా డైమండ్ డబ్బా నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో యువకులు వచ్చారు. టీడీపీ నాయకుల అండతో నిర్వాహకులు మంగళవారం మధ్యాహ్నం నుంచి డైమండ్ డబ్బా జూదాన్ని నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున వరకు ఇది జరిగింది. ఈ ఏడాది ఆగస్టు నెలలో గొలగమూడిలోని వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా ఈ జూదం జరిగినా పోలీసులు పట్టించుకోలేదు. దీంతో నిర్వాహకులు అనికేపల్లిలోనూ దర్జాగా జరిపి భారీగా సొమ్ము చేసుకున్నారు. అనికేపల్లి, గొలగమూడి గ్రామాల్లో ప్రతి ఆదివారం డైమండ్ డబ్బా సాగుతుండటంతో తమ కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


అనికేపల్లిలో డైమండ్ డబ్బా నిర్వహిస్తూ..





నిమ్మధరలు (కిలో)
పెద్దవి: రూ.35
సన్నవి: రూ.20
పండ్లు: రూ.10

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION
■ Join B.Sc Ai / CSc over 60%, Maths in 10+2 get 5000 fee discount Join M.Com/ MA Eng/MSW by 6/10, 3000 fee dis, 9177408565 [SCA25008618]

COMPUTER EDUCATION
■ ఉచిత కంప్యూటర్ మరియు ఇంగ్లీష్ శిక్షణ : DDU-GKY ద్వారా ఉచిత వసతి, భోజనము, మెటీరియల్స్, యూనిఫార్మ్స్‌తో పాటు సెంట్రల్ గవర్నమెంట్ సర్టిఫికేట్ అందజేయ బడును. 100% ఉద్యోగంతో పాటు ప్రతి విద్యార్థికి 3810/- స్కాలర్‌షిప్ అందజేయబడును. అతి తక్కువ సీట్లు కలవు. Nellore, B.V. Nagar, సంప్ర॥ 98485 87218, 89198 93256. [NA-236]

REAL ESTATE

■ House, Site, Plot any area sales or buying contact us agents commission based contact No. : 7382527139. [NA-5614]

■ స్పాట్ క్యాష్‌తో కనుపర్తిపాడు, పడారుపల్లి కొండాయపాలెం, కల్లూరుపల్లి,బి.బి. నెల్లూరు, కాకుటూరు, B.V.నగర్ ఏరియాలలో అన్ని లేఅవుట్ల నందు ప్లాట్లు కొన॥ ✆ 9849489529 [NA-7151]

FLAT FOR SALE
■ నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్ రోడ్, సాయిబాబా గుడి ఎదురు వీధిలో Ready to Occupy 3BHK లగ్జరీ ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. సంప్రదించండి. 9177751401, 9989292211. [NA-230]

HOUSE FOR SALE
■ ఇండిపెండెంట్ హౌస్ : నెల్లూరు సిటీ, B.V. నగర్, R.T.O. ఆఫీసు రోడ్డు దగ్గర, 2 కార్లు పార్కింగ్ కల్గిన 2 ఫ్లోర్లు ఈస్ట్‌ఫేస్ కొత్త ఇల్లు అమ్మబడును. సంప్ర॥ 7995434866 [NA-24329]

PLOT FOR SALE
■ మన దేశంలోనే మైసూర్ శాండిల్ కంపెనీకి అమ్మి మంచి ఆదాయాన్ని అందించే శ్రీ గంధం మొక్కలు మన నెల్లూరు కంపెనీ వారు మన జిల్లాలోని ఫామ్ ల్యాండ్స్‌గా అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారు. 9908822077 [SCA25008576]

SERVICES

GOLD FINANCE
■ MVS Gold బ్యాంకులలో, ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి కొన బడును. Opp. సాయిబాబా గుడి, వేదాయపాళెం, Nlr. 9346332303, 9281458813. [NA-11387]

WANTED

■ Ladies with Computer knowledge to work at kids Indoor Play zone (11 AM - 9 PM) Beside Bharath Petrol Bunk, Children's Park, Main Road. 9392829709 [NA-7153]

■ Business Managers & Female Accountant, Solar Technicians, Electricians, Female Telecallers. Qly: MBA, B.Tech /Diploma, Sal+PF+E.SI. ✆ 9000731560 [NA-11388]

■ CAPO CARE సర్జికల్ కంపెనీ నందు పని చేయుటకు రిప్రెసెంటేటివ్స్ కావలెను. 8985866611 [NA-SCA25008597]

■ కేర్ టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో ప్రముఖ హోమ్‌కేర్ ఆఫీస్ కి ఇంటి వద్దనే ఉండి పెద్దవారిని చూసుకోనుటకు అనుభవంగల స్టాఫ్ కావలెను. ✆ 916083 5559, 99121 15559 [B-279]

■ KTM బైక్ షోరూం నందు పని చేయుటకు అనుభవము కలిగిన సర్వీస్ అడ్వైజర్స్ కం కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. బయోడేటాతో సంప్ర॥ HDFC బ్యాంక్ ఎదురుగా, వేదాయపాళెం, నెల్లూరు. 7013569269 [NA-948]

■ లేడీటెలికాలర్స్ కావలెను. ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ నందు జాబ్ చేయుటకు లేడీ టెలి కాలర్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం+ఇన్సెంటివ్స్.9177234987. [NA-SCA25008593]

■ లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. Qul : Any Degree, B.Tech / B.CA with computer knowledge, & 1-2 Yrs Experience. Contact : Dr. S. ఆండాళ్, లక్ష్మీ ఫెర్టిలిటీ సెంటర్, S2 సినిమా థియేటర్, పొగతోట, నెల్లూరు. సంప్ర॥ 99088 54316 [NA-2932]

■ పికర్స్, ప్యాకర్స్, డ్రైవర్స్, హెల్పర్స్ కావలెను. సంప్రదించండి. HERO సూపర్ స్టాకిస్టు, శ్రీ బాలాజీ ఆటో మొబైల్స్, ఇనుమడుగు సెంటర్, నెల్లూరు. సెల్: 91000 66733. [SCA25008540]

■ శ్రీ దక్షిణామూర్తి టెక్స్‌టైల్స్, మినిబైపాస్ రోడ్, నెల్లూరు నందు పని చేయుటకు Tally అనుభవం గల లేడీ అకౌంటెంట్, కారు డ్రైవింగ్‌లో అనుభ వం గల సేల్స్‌మెన్ మరియు సేల్స్‌బాయ్స్, సేల్స్ గర్ల్స్ కావలెను. ఆకర్షణీయ జీతం ఇవ్వబడును. 9441132023 [NA-233]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకోనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.